## ప్రజా సంక్షేమమే బీజేపీ నినాదం

### మండల బీజేపీ ప్రెసిడెంట్ అరే రవీందర్



భీమ్ గల్, బతుకమ్మ : జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేయించి పార్లమెంట్ పరిధిలో ఆర్ ఓ బి లు, బ్రిడ్జ్ లు మరెన్నో అభివృద్ధి పనులను చేసిన ఎం. పీ అరవింద్ భీమ్ గల్ మండలానికి తన ఎం. పి లాడ్స్ నుండి రూ. 8లక్షల నిధులు కేటాయించారని మండల బీజేపీ ప్రెసిడెంట్ అరే రవీందర్ తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఎల్. జె ఫంక్షన్ హాల్ లో ప్రెస్ మీట్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ మండలంలోని ముచ్కూర్ లో శ్రీరామాలయ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 4లక్షలు, రహత్ నగర్ గ్రామంలో బస్సు షెల్టర్ నిర్మాణానికి రూ. 4లక్షల నిధులను కేటాయించడం జరిగిందన్నారు.

## బీసీ రిజర్వేషన్లపై పార్లమెంట్లో చట్టం చేయాలి

### సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : బీసీ రిజర్వేషన్లపై పార్లమెంట్లో చట్టం చేయాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ లో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చట్టాన్ని పార్లమెంట్లో ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర అనంతరం ఇంకా సామాజికంగా వెనుకబడిన తరగతులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయటానికి జనాభా కనుగుణంగా రిజర్వేషన్లను అమలు జరపాలని డిమాండు ఉందన్నారు.

## బోర్గాం(పి)లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



నిజామాబాద్, బతుకమ్మ: మోపాల్ మండలం బోర్గాం(పి) గ్రామంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఆయుష్మాన్ భారత్ – హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్ (పల్లె దవాఖాన), శాఖా గ్రంథాలయం, సొసైటీ ఎరువుల గిడ్డంగిని తనిఖీ చేశారు. పల్లె దవాఖానాను సందర్శించిన కలెక్టర్, సిబ్బంది హాజరును పరిశీలించారు. ఈ హెల్త్ సెంటర్ ద్వారా అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీస్తూ, రికార్డులను తనిఖీ చేశారు. ఇమ్యునైజేషన్, ఏ.ఎన్.సీ చెకప్ లు, టీ.బీ ముక్త్ భారత్ అభియాన్, ఆరోగ్య శిబిరాల నిర్వహణ తదితర సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని హితవు పలికారు.

## ఇందిరా పార్క్ వద్ద పెన్షనర్ల ధర్నా



హైదరాబాద్, బతుకమ్మ : రాష్ట్రవ్యాప్తంగా నున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఇందిరా పార్క్ హైదరాబాద్ వద్ద పెన్షనర్లు వేలాదిమందితో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. నిజామాబాద్ ఆల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో దాదాపు 150 మంది పాల్గొన్నారు. సిర్ప లింగయ్య పెన్షనర్లపై పాడిన పాటలు ఇందిరా పార్క్ వద్దనున్న పెన్షనర్లు అలరించాయి. జేఏసీ నాయకులు ఏలూరు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, పెన్షనర్ల కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్లు కే.లక్ష్మయ్య, పాలకుర్తి కృష్ణమూర్తి తదితరుల నేతృత్వంలో పెన్షనర్ల ధర్నా జరిగింది.

## ప్రమాదవశాత్తు ఒకరు మృతి



మాక్లూర్, బతుకమ్మ : మాక్లూర్ మండలంలోని బోర్గం కే గ్రామంలో కాలువజారి డ్రైనేజీలో పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సంగే వార్ ప్రకాష్(44) కుట్టు మిషన్ చేస్తూ ఉండేవారు. ఆదివారం రాత్రి తన ఇంట్లో నుంచి లేచి మూత్రవిసర్జన చేయడానికి బయటకెళ్ళి తిరిగి వస్తున్న సమయంలో డ్రైనేజీ పై కాలు జారటంతో ఒక్కసారిగా డ్రైనేజీలో పడిపోయాడు.

## డయల్ 100 దుర్వినియోగం చేసిన ఒకరికి జైలుశిక్ష

నిజామాబాద్ క్రైం, బతుకమ్మ : హైదరాబాద్ మల్కాజిగిరి నివాసుడైన కేతావత్ పరుశురామ్ పోలీస్ 100 ఫోన్ కాల్ ను దుర్వినియోగం చేసిన నేరానికిగాను నాలుగు రోజుల జైలుశిక్షను విధిస్తూ నిజామాబాద్ రెండవ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ నూర్జహాన్ బేగమ్ సోమవారం తీర్పు చెప్పారు. ధర్పల్లి మండలం డి బి తాండాకు చెందిన బంధువుల ఇంటికి వచ్చిన పరుశరామ్, బంధువులు ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు పదే పదే 100 కాల్ చేసి దుర్వినియోగం చేసినట్లు తన నేరాంగీకారంలో తెలిపాడు. ముద్దాయి 100 పోలీస్ డయల్ తప్పుడు సమాచారం ఇచ్చి ఫోన్ చేసినట్లు నేరంగీకారం ప్రకటనను నమోదు చేసిన కోర్టు అతనకి నాలుగు రోజుల జైలుశిక్షను విధించింది.

## ఘనంగా ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ జన్మదిన వేడుకలు




నిజామాబాద్ సిటీ, బతుకమ్మ: టిఎన్జీవో జిల్లా సంఘం ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ అధ్యక్షతన ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ జన్మదిన వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో బాధ్యులు, అన్ని శాఖల ఫోరం అధ్యక్ష కార్యదర్శులు శ్రేయోభిలాషులు అందరూ సుమన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువ, గజమాలతో సన్మానించారు.

## కళ్యాణ్ లక్ష్మి చెక్కుల పంపిణీ



బతుకమ్మ, బిచ్కుంద : బిచ్కుంద మండలంలోని రాజుల్ల గ్రామం లో లబ్దిదారులకు నూతన రేషన్ కార్డులను, కళ్యాణ లక్ష్మి చెక్కులను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు,సబ్ కలెక్టర్ కిరణ్మయి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డుల వల్ల అనేక సంక్షేమ పథకాలను ప్రజలు పొందవచ్చని ఆసుపత్రిసేవలు, ఇళ్లులేని వారు ఇందిరమ్మ ఇళ్లు ఇలా అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందగలరని ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు.

## మండపాల ఏర్పాటులో పోలీసుల ఆదేశాలను పాటించాలి



బతుకమ్మ,ఏర్గట్ల: వినాయక చవితి మండపాల ఏర్పాటులో భాగంగా జిల్లా సి పి ఆదేశాల మేరకు ఏర్గట్ల పోలీస్ స్టేషన్ వద్ద ఈ నెల 13 తేదీన మండల పరిధిలోని గ్రామంలో ఉన్న యువజన సంఘాల సభ్యులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఏర్గట్ల ఎస్సై రాజేశ్వర్ తెలిపారు. పత్రిక విలేకరులతో ఎస్సై మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రతి యూత్ నుండి నల్గురు ఈ సమావేశానికి హాజరు కావాలని అన్నారు.

## అంక్సాపూర్ హై స్కూల్‌కు దయారెడ్డి విరాళం



వేల్పూర్, బతుకమ్మ : మండలంలోని అంక్సాపూర్ గ్రామ జడ్పీ హెచ్ ఎస్ స్కూల్ కు ప్రముఖ పారిశ్రామిక వేత్త, విద్యావేత్త ఏనుగు దయానంద్ రెడ్డి (దయారెడ్డి)20 డ్యూయల్ డెస్క్ లను విరాళంగా అందజేశారు. చిట్టాపూర్ గ్రామ వాస్తవ్యులు దయారెడ్డి ఇప్పటికి వరకు బాల్కొండ నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలకు ఇదే తరహాలో విరాళాలు అందించిన ధాత.

## కార్మికుల పట్ల ప్రభుత్వం సవతితల్లి ప్రేమ

### ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.రమేష్



సిరికొండ, బతుకమ్మ : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వెంటనే అమలు చేయాలని, వ్యవసాయ కార్మికుల పట్ల ప్రభుత్వ సవతితల్లి ప్రేమ చూపిస్తోందని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ. రమేష్ తీవ్రంగా విమర్శించారు. సోమవారం సిరికొండ మండలంలోని రావుట్ల గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐకేఎంఎస్) సిరికొండ మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

## పోరాట స్ఫూర్తిని కొనియాడి ఘన నివాళులు



ఆర్మూర్, బతుకమ్మ: ఆర్మూర్ లోని అంబేద్కర్ చౌరస్తాలో ఆర్మూర్ డివిజన్ మాల మహానాడు ఆధ్వర్యంలో మాల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని మాల మహానాడు డివిజన్ అధ్యక్షులు మాదరి రాజన్న, ట్రెజరర్ పులి గంగాధర్ ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి శెట్టిపల్లి నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు పింజా పెద్ద భోజన్న,ఎం కోటేశ్వరరావు,చిట్టిమాల నగేష్ లు పాల్గొని పానంగి శేషయ్య, గోపతోటి నారాయణ,ల వీరోచిత పోరాట స్ఫూర్తిని కొనియాడి వారికి ఘనంగా నివాళులు అర్పించారు.

## అయ్యగుట్టపై ప్రత్యేక పూజలు



వేల్పూర్, బతుకమ్మ : శ్రావణ మాసంను పురస్కరించుకొని మండలంలోని రామన్నపేట్ అయ్యల గుట్టపై సోమవారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. యేటా నిర్వహించే ఈ శ్రావణ సోమవార పూజల్లో భాగంగా ఆలయ గద్దె పై శ్రీవీరభద్రుడు, అమ్మవారికి జంగమ్మయ్య ప్రత్యేక పూజలు చేసి హారతి, నైవేద్యం చేశారు. అనంతరం భక్తులు స్వామి వారికి నైవేద్యలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు.

## పాఠశాల గదులను వెంటనే నిర్మించాలి : టీజీవిపి



బతుకమ్మ, భిక్కనూరు: భిక్కనూరు పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని టీజీవీపీ మండల అధ్యక్షులు భరత్ రాజ్ సోమవారం ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజా గంగారెడ్డికి వినతి పత్రం అందజేశారు.


## మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన సాయి టవర్స్ వాసులు



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలోని.. మూడో డివిజన్ మహాలక్ష్మి నగర్ సాయి టవర్స్ కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ ను కలిశారు. కాలనీ లో రోడ్డు, డ్రైనేజీ, మంచి నీటి సమస్య పై వినతి పత్రం అందచేశారు. సమస్యల పై కమిషనర్ సానుకూలంగా స్పందించారు. సాయి టవర్స్ కాలనీ సందర్శించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

## ప్రతి బూత్ బీజేపీ బూత్ చేయడమే లక్ష్యంగా పని చేస్తాం

### బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావుని రాష్ట్ర కార్యాలయంలో నిజామాబాదు జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ రాష్ట్ర అధ్యక్షులు తో రాంచందర్ రావు తో జిల్లాలో పార్టీ కార్యక్రమాలపైన చర్చలు జరిపారు.

## గౌడ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



మోర్తాడ్, బతుకమ్మ: మోర్తాడ్ మండల గౌడ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో నూతన అధ్యక్షులుగా శ్రీకాంత్ గౌడ్, ఉపాధ్యక్షులుగా గంగాధర్ గౌడ్, వినీత్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నవీన్ గౌడ్, సంయుక్త కార్యదర్శి గా శివ సాయి గౌడ్ ఎన్నికయ్యారు. గౌడ సంఘ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు వివిధ కారణాలతో అనారోగ్యంతో బాధపడి చికిత్స చేసుకున్న బాధితులకు సీఎం సహాయ నిధి ద్వారా 121 మందికి చెక్కులు అందించామన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి, అత్యవసర ఆరోగ్య అవసరాలకు సీఎం సహాయ నిధి పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భరోసా లభిస్తుందని అన్నారు.

## ప్రభుత్వ ఆస్తుల వివరాలను వెంటనే తెలియజేయాలి



కామారెడ్డి, బతుకమ్మ : రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు తదితర అన్ని ప్రభుత్వ ఆస్తుల వివరాలను వెంటనే తెలియజేయాలని విద్యుత్ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆదేశించారు. ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఇంజనీరింగ్ శాఖల కార్యాలయాలు, ఆస్పత్రులు, అంగన్వాడీ భవనాలపై రూఫ్ టాప్ సోలార్ సిస్టం ద్వారా చర్యలు తీసుకుంటుందని అన్నారు.

## కాశీ విశ్వనాథునికి మహా రుద్రాభిషేకం



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో మార్వాడి గల్లీలోని తన నివాసంలో శ్రావణ మాస పర్వదినాన్ని పురస్కరించుకొని కాశీ విశ్వనాథునికి భక్తిశ్రద్ధలతో మహా రుద్రాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ పుణ్య కార్యక్రమంలో ప్రముఖ వేద పండితులు పాల్గొని, శాస్త్రోక్తంగా మహాదేవునికి గంగాజలంతో, పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు " ఇందూర్ జిల్లా ప్రజల ప్రజల సంక్షేమం, ఆరోగ్యం, అభివృద్ధి, లోక కళ్యాణం కోసం ఈ రుద్రాభిషేకాన్ని గత 50 ఏళ్లనుండి నిర్వహించడం జరుగుతుందని అన్నారు.